సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



బాసరలో భక్తుల రద్దీ 8లో▸
వరుస సెలవులు రావడంతో బాసరలో రద్దీ పెరిగింది. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు.



ముగిసిన జాతీయస్థాయి పోటీలు
బెల్లంపల్లిలో జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.3/20.0

వాతావరణం
అల్పపీడన ప్రభావంతో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

రివైండ్ 2024 ప్రజల గొంతుక.. సాక్షి

2024 ఏడాది కాలగర్భంలో కలిసిపోతోంది. ప్రజల పక్షపాతి.. 'సాక్షి' ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని ఎన్నో సమస్యలను వెలుగులోకి తీసుకురాగా, మరెందరో అధికారుల అవినీతిని బట్టబయలు చేసింది. గుక్కెడు నీటికి తండ్లాడే పల్లెల గొంతుక తడిపింది. అనారోగ్యంతో మంచం పట్టిన వారికి భరోసాగా నిలిచింది. ఓ వైపు గిరిజన ఉత్సవాలు.. మానవీయ కథనాలతో సత్తా చాటుతూనే అక్రమార్కుల భరతం పట్టేందుకు 'పెన్ను' బిగించింది..

- వివరాలు 8లో▸



న్యూస్‌రీల్

హౌసింగ్ పీడీగా బసవేశ్వర్

కైలాస్‌నగర్: జిల్లాలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించేందుకుగానూ గతంలో మాదిరి ప్రతీ జిల్లాకు ఓ ప్రాజెక్టు అధికారి ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాలో ఈఈగా పనిచేస్తున్న బసవేశ్వర్‌ను హౌసింగ్ పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నందున మరి కొంతమంది ఇంజినీరింగ్ అధికారులను నియమించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన క్రీడాకారులు



బస్సును ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

ఆదిలాబాద్: సీఎం కప్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు గురువారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పీఈటీ హరిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

'అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి'



బాధిత కుటుంబ సభ్యులతో ఈశ్వరీబాయి

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మహిళా కమిషన్ బాధితురాలికి అండగా నిలుస్తుందని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మహిళలకు మరింత రక్షణ అందించాలని కోరారు. ఈ విషయమై డీఎస్పీ నాగేందర్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు.

విజయ్ హజారే ట్రోఫీకి ఎంపిక



కొడిమెల హిమతేజ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన కొడిమెల హిమతేజ బీసీసీఐ విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. హైదరాబాద్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న హిమతేజ బీసీసీఐ అండర్ 23 వన్డే టోర్నమెంట్‌లో జట్టు కెప్టెన్‌గా వ్యవహరించి బ్యాటర్‌గానూ సత్తా చాటాడు. ఆరు మ్యాచుల్లో 624 పరుగులతో ప్రతిభ కనబరిచినట్లు కోచ్ జయేంద్ర పటాస్కర్ తెలిపారు. ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీలో సైతం సత్తా చాటిన ఈ యువ క్రికెటర్ ఈ టోర్నమెంట్లో మెరిస్తే ఐపీఎల్ మ్యాచ్‌లో అవకాశాలు రావడమే కాకుండా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని శిక్షకుడు తెలిపారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న నూర్‌సింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నవీన్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 317 బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల స్థానంలో ఇస్తున్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో నాయకులు జాదవ్ ప్రకాష్, మోహన్ సింగ్, ముజీబ్, దాసరి బాబు, సంతోష్, రమేశ్, రామేశ్వర్, గణేశ్, రాజేశ్వర్, దేవిచంద్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

- అఘాయిత్యాలకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు
- పరీక్షలంటే భయం వీడాలి
- పది, ఇంటర్ విద్యార్థులకు 'టెలీ మానస్' సేవలు
- 24 గంటల పాటు అందుబాటులో టోల్‌ఫ్రీ నం.14416

ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని రెండేళ్ల క్రితం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మానసిక ఆందోళనకు గురైంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఏమంటారోనని భయాందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు అఘాయిత్యానికి పాల్పడి కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి.



బేల ప్రభుత్వ కళాశాలలో టెలీమానస్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పదోతరగతి విద్యార్థుల భవిష్యత్‌కు పబ్లిక్ పరీక్షలే తొలిమెట్టు. అలాగే ఇంటర్ విద్య కూడా ఎంతో కీలకమైంది.. ఈ రెండు పరీక్షల్లో నెగ్గితే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చు. కానీ కొంతమంది విద్యార్థులు పరీక్షలంటేనే భయాందోళనకు గురవుతారు. పరీక్షల్లో ఫెయిల్ అవుతామోనని ఆందోళన చెందుతుంటారు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు ఏమంటారోనని తీవ్ర మనోవేదనకు గురవుతారు. ఒత్తిడిని జయిస్తే విజయం మీ సొంతం అవుతుంది. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు, లెక్చరర్లు చెబుతున్నారు. అయితే పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన ఇదే చివరిది కాదని, ఎంతోమంది మేధావులు పరీక్షల్లో ఫెయిల్ అయి ఆ తర్వాత రాణించారనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. పరీక్షలే జీవితం కాదని, భవిష్యత్ గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు మానసిక వైద్య నిపుణులు. ఎవరైనా ఆలోచనలతో సతమతం అవుతుంటే వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం టెలీ మానస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టోల్‌ఫ్రీ నం.14416కు ఫోన్‌చేస్తే 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు. కౌన్సెలింగ్ నిర్వహించి ఒత్తిడిని జయించేలా చూస్తారు.

టెలీ మానస్ సేవలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల కంటే ప్రైవేట్‌లో విద్యాభ్యాసం చేస్తున్న వారు అధికంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మార్కులపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తే తమ కళాశాలకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో రాత్రి, పగలనే తేడా లేకుండా చదవాలని ఒత్తిడి తెస్తుంటారు. తల్లిదండ్రులు వేలరూపాయల ఫీజులు కట్టడంతో తమకు తక్కువ మార్కులు వస్తాయేమోనని కొంతమంది విద్యార్థులు భయాందోళనకు గురవుతుంటారు. దీంతో చదువుపై దృష్టి సారించక ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందకుండా ప్రభుత్వం టెలీ మానస్ సేవలను ప్రారంభించింది. టోల్‌ఫ్రీ 14416కు ఫోన్‌చేసి విద్యార్థులు కౌన్సెలింగ్ పొందవచ్చు. 24 గంటల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఒత్తిడి, భయం, మానసిక ఆందోళన తదితర సమస్యల పరిష్కారం, భవిష్యత్ గురించి తెలియజేస్తారు. ఒంటరితనం, ఆత్మవిశ్వాసం, సోషల్ మీడియాకు ఏవిధంగా దూరంగా ఉండాలి.. ఏవిధంగా చదవాలి.. పరీక్షలు ఎలా రాయాలి.. తదితర వాటి గురించి విషయ నిపుణులు వివరిస్తారు. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి తదితర సమస్యలతో జరిగే అనర్థాల గురించి తెలియజేస్తారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా చూస్తారు.

సమీపిస్తున్న పరీక్షలు..

పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తయ్యింది. ప్రస్తుతం విద్యార్థులకు రివిజన్ చేయిస్తున్నారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థులను పరీక్షల కోసం సన్నద్ధం చేస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అయితే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 22 వరకు ఉండగా వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్నాయి. జిల్లాలో 13 ప్రభుత్వ కళాశాలలు, 19 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 45 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మొత్తం జిల్లాలో 77 కళాశాలలు ఉండగా, 20 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 3,100 మంది, ద్వితీయ సంవత్సరం 3,264 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి. ప్రభుత్వ యాజమాన్యానికి సంబంధించి జిల్లాలో 107 ఉన్నత పాఠశాలలు ఉండగా మరో 50కి పైగా వివిధ పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది 10,040 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



పరీక్షలు సమీపిస్తున్న సమయంలో కొంతమంది విద్యార్థులు ఆందోళన, మానసిక ఒత్తిడికి గురవుతారు. మంచి మార్కులు వస్తాయో.. రావో, పాస్ అవుతానో.. లేదో అనే భావనతో చదివింది కూడా పరీక్షల్లో రాయలేరు. పరీక్ష ఫలితాల గురించి మర్చిపోయి ప్రశాంతంగా చదవాలి. సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండాలి. ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరీక్షలే జీవితం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

– ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

అవగాహన కల్పిస్తున్నాం



టెలీ మానస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలల్లో టోల్‌ఫ్రీ నంబర్ గురించి తెలియజేస్తున్నాం. ఆరోగ్య కళాశాల కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజు ప్రార్థన సమయంలో పరీక్షల్లో ఎలా రాణించాలనే విషయాలను వివరిస్తున్నాం. ఒత్తిడికి గురికాకుండా చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా మానసికంగా ఇబ్బందులకు గురైతే 14 416కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

– రవీంద్రకుమార్, డీఐఈవో, ఆదిలాబాద్

జైనథ్ ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి రమాకాంత్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): హైకోర్టు జడ్జి డి.రమాకాంత్ గురువారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని తాడోబాకు కుటుంబ సమేతంగా వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సంపత్ కుమార్ ఆశీర్వచనాలు అందించి శాలువాతో సత్కరించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు.

పత్తి రైతుల ఆందోళన



ధర్నా చేస్తున్న రైతులు

బేల: సీసీఐ అధికారులు పత్తికి మద్దతు ధర రూ.7,521కంటే రూ.50 తగ్గించడంపై బేలలోని ఆశపుర జిన్నింగ్ ఎదుట 353బి జాతీయ రహదారిపై గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్‌లో చెల్లిస్తున్న ధరను ఇక్కడ చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఠాక్రే గంభీర్, సతీష్ పవార్, ప్రమోద్‌రెడ్డి, ఠాక్రే మంగేష్, దేవన్న, తేజ్‌రావు, విపిన్ రైతులకు మద్దతు తెలిపారు. సీసీఐ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ పూజ సంఘటన స్థలానికి చేరుకుని ఆదిలాబాద్‌లో ఇచ్చే ధరకే నాణ్యమైన పత్తిని కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో ఆందోళన విరమించారు.

'హక్కుల సాధనకు పోరాడుతాం'

ఇంద్రవెల్లి: సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిండిగల్ యాదగిరి అన్నారు. గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మండలంలోని ముత్నూర్‌లో కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించి అమరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పీసీసీ అధ్యక్షుడి హోదాలో దీక్షా శిబిరాన్ని సందర్శించిన రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే సచివాలయానికి సగౌరంగా ఉద్యోగులను పిలిచి సర్వీస్ క్రమబద్ధీకరించడంతో పాటు పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల ఉద్యోగులు 17 రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం స్పందించడం లేదన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ గోడం గణేశ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థ కుంటూ పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పోరాటానికి తమ సంఘం మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదేరావ్, మహిళా సంఘం అధ్యక్షురాలు రేణుక, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, కార్యదర్శి ధరంసింగ్, సభ్యులు దీప్తి, శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాష్, మమత, రాథోడ్ విష్ణు, గణేశ్, సందీప్, సలీం, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో సమగ్ర శిక్షా ఉద్యోగులు, నాయకులు

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ చర్యలు

- టీచర్లకు తాత్కాలిక ఎస్‌వో బాధ్యతలు
- 17 రోజులుగా సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

తాత్కాలిక ప్రత్యేక అధికారులు వీరే..

మండలం	పేరు
బేల	సీహెచ్.అరుణ, ఎస్జీటీ, సిర్సన్న
భీంపూర్	జి.భారతి, ఎస్జీటీ, భీంపూర్
బోథ్	కృష్ణజ్యోతి, పీజీటీ, మోడల్ స్కూల్, బోథ్
ఇచ్చోడ	ఆడె అంబికా, ఎస్జీటీ, ఎస్సీకాలనీ, ఇచ్చోడ
ఇంద్రవెల్లి	సవిత, ఎస్‌ఏ, వాల్గొండ, ఇంద్రవెల్లి
జైనథ్	పి.విజయలక్ష్మి, టీజీటీ, మోడల్ స్కూల్, జైనథ్
ఆదిలాబాద్‌రూరల్	గంగాదేవి, ఎస్జీటీ, బంగారుగూడ
ఆదిలాబాద్‌అర్బన్	ఎస్‌ఏ, ఆర్పీఎల్, ఆదిలాబాద్
గాదిగూడ	కల్పన, ఎస్జీటీ, లోకారి(కె)
నేరడిగొండ	లీలావతి, ఎస్జీటీ, బోరెగాం(బి)
తలమడుగు(లింగి)	టి.లలిత, ఎస్‌ఏ, జెడ్పీఎస్ఎస్, లింగి
బజార్‌హత్నూర్	తస్నీమ్‌కౌర్, ఎస్‌ఏ, బుర్కపల్లె
గుడిహత్నూర్(తోషం)	ఇందిరా, గుడిహత్నూర్ మోడల్ స్కూల్
నార్నూర్	రాథోడ్ పల్లవి, ఎస్జీటీ, ఉమ్రి
మావల	జయశ్రీ, ఎస్జీటీ, భీంపూర్

ఆదిలాబాద్‌టౌన్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరేంత వరకు విధులకు హాజరుకామని సమగ్ర శిక్షా ఉద్యోగులు భీష్మించుకు కూర్చున్నారు. పక్షం రోజులుగా సమ్మెలో ఉండడంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), యూఆర్ఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. పదోతరగతి, ఇంటర్ విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. తాత్కాలికంగా టీచర్లకు ప్రత్యేక అధికారులు (ఎస్‌వోలు)గా బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించి వారి వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. వీరితో పాటు ప్రతీ కేజీబీవీకి ఇద్దరు లేదా ముగ్గురు టీచర్లను నియమించనున్నట్లు సమాచారం. అయితే ఉపాధ్యాయులకు కేజీబీవీల్లో విద్యాబోధన చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కాగా ఉట్నూర్, తాంసి మండలాలకు సంబంధించిన ఎస్‌వోలను నియమించాల్సి ఉందని కేజీబీవీ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ తెలిపారు.

గడువులోపు గగనమే!

- 'ఇందిరమ్మ' సర్వేను వేధిస్తున్న సర్వర్ సమస్య
- ఇప్పటి వరకు 45.91 శాతం పూర్తి
- ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మరీ నెమ్మదిగా



ఇచ్చోడ మండలం గెర్జంలో సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జిల్లాలో స్లోగా సాగుతోంది. వచ్చే ఏడాది జనవరి 2 లోపు పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ ఇటీవల ఆదేశించారు. అయితే నిర్ణీత గడువులోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిస్థాయిలో జరగడం అసాధ్యంగానే కనిపిస్తోంది. ఇప్పటి వరకు దరఖాస్తుల పరిశీలన 50 శాతం కూడా పూర్తి కాకపోవడమే ఇందుకు ఉదాహరణ. గ్రామీణ ప్రాంతాల్లో యాప్‌కు సంబంధించి నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో పాటు దరఖాస్తుదారులు సకాలంలో అందుబాటులో ఉండడం లేదు. మరి కొంతమంది వివరాలు సమగ్రంగా ఇవ్వడం లేదు. దీంతో దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అయితే నెట్‌వర్క్ సమస్య లేనటువంటి ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోనూ ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,97,448 మంది దరఖాస్తు చేసుకోగా గురువారం వరకు 90,649 దరఖాస్తుల పరిశీలన జరిగింది. 45.91 శాతం ప్రక్రియ నమోదైంది. మిగతా దరఖాస్తులను ఎంత వేగంగా పరిశీలించినప్పటికీ మరో వారం రోజుల గడువులోగా మిగిలిన 1,06,799 దరఖాస్తుల పరిశీలన ఏ విధంగా సాధ్యమవుతుందనే ప్రశ్న తలెత్తుతోంది.

ప్రత్యేక యాప్‌లో సమాచారం నమోదు

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. మున్సిపాలిటీ ఏరియాల్లో వార్డు అధికారులు, గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సెక్రెటరీలు ఈ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ యాప్ సర్వే నిర్వహిస్తున్నారు. తమకు కేటాయించిన ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్నారు. దరఖాస్తుదారు పేరుతో పాటు ఆధార్ కార్డు నంబర్, స్థలం ఉంటే ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఇల్లు శిథిలావస్థకు చేరి ఉంటే అట్టి ఫొటో, ఇంటి పన్ను రశీదు, కరెంట్ బిల్లు, అద్దెకు ఉంటే ఆ ఇంటి ఫొటోతో పాటు లొకేషన్ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే దరఖాస్తుదారుకు వ్యవసాయ సాగు భూమి ఉందా? అనే వివరాలను ఆరా తీస్తున్నారు. చాలామంది భూమి ఉన్నప్పటికీ లేదని చెబుతుండడం సమస్యగా మారుతోంది. ఇంటి కేటాయింపులో దివ్యాంగులు, వితంతువులు, భూమిలేని పేదలకు ప్రాధాన్యత నివ్వనుండటంతో అలాంటి వారి వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు.

వేధిస్తున్న సర్వర్ సమస్య

జిల్లాలో పంచాయతీ సెక్రెటరీలు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు తగినంతగా లేకపోవడంతో సర్వే సకాలంలో పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతో సర్వే చేయిస్తున్నారు. ఇలా 410 మంది ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో అక్కడి మారుమూల గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య అధికంగా తలెత్తుతోంది. దీంతో అక్కడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆఫ్‌లైన్‌లోనూ యూజర్ ఐడీలను కేటాయించి 237 మందితో సర్వే చేయిస్తున్నారు. ప్రధానంగా సర్వర్ డౌన్ కావడం, నెట్‌వర్క్ సమస్య ఎక్కువగా తలెత్తుతుండటంతో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఇప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో 4,991 ఇళ్లను సర్వే చేశారు. మొత్తంగా 85,659 గృహాల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. అత్యధికంగా మావల మండలంలో 70.76 శాతం సర్వే జరిగింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ, జైనథ్, తలమడుగు, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లో ఈ ప్రక్రియ మరీ నెమ్మదిగా సాగుతుండడంతో ఇప్పటి వరకు 40 శాతం కూడా దాటలేదు. దీంతో నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి కావడం అసాధ్యంగా కనిపిస్తోంది.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలు

మండలం	అందిన దరఖాస్తులు	సర్వే పూర్తయిన దరఖాస్తులు
మావల	1,505	1,065
గాదిగూడ	6,474	4,303
బేల	12,083	7,813
భీంపూర్	7,433	4,495
ఆదిలాబాద్‌రూరల్	11,392	6,375
తాంసి	4,852	2,698
గుడిహత్నూర్	9,514	4,888
నేరడిగొండ	8,902	4,448
బజార్‌హత్నూర్	8,797	4,306
ఇంద్రవెల్లి	11,687	5,596
బోథ్	13,056	5,883
నార్నూర్	8,714	3,805
సిరికొండ	5,470	2,201
ఆదిలాబాద్ మున్సిపాలిటీ	31,153	12,368
జైనథ్	15,476	6,066
తలమడుగు	10,551	3,848
ఇచ్చోడ	12,874	4,558
ఉట్నూర్	17,515	5,933

త్వరగా పూర్తిచేసేలా చర్యలు

మొన్నటి వరకు నెట్‌వర్క్ సమస్య, సర్వర్ డౌన్ కావడం వంటి కారణాలతో పరిశీలన నెమ్మదిగా సాగింది. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తొలగిపోవడంతో దరఖాస్తుల పరిశీలన వేగవంతమయ్యే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేకపోవడంతో ఆఫ్‌లైన్‌లోనూ సర్వే చేయిస్తున్నాం. నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో పరిశీలన చేసేలా శ్రద్ధ వహిస్తాం.

– జి.జితేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో

ప్రజల గొంతుక.. సాక్షి

- ప్రజల పక్షపాతిగా కథనాలు
- స్పందించిన అధికారులు
- అక్రమార్కులపై చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి 'సాక్షి'తనవంతుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ విభాగాల్లో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడిన వారిపై కొరడా ఝులిపించేలా ప్రత్యేక కథనాలు ప్రచురించింది. వీటికి జిల్లా అధికారులు స్పందించారు. నిబంధనలు అతిక్రమించిన ఉద్యోగులు, అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నారు. 2024లో సాక్షి ఎఫెక్ట్ కథనాలు..

రివైండ్ 2024



- **మంచిర్యాలఅర్బన్:** వసతిగృహాలకు నాసిరకం సరుకుల సరఫరాపై నవంబర్ 18న 'క్వాలిటీ కాంట్రాక్టర్లకే ఎరుక' 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.



- **కైలాస్‌నగర్:** 'మడిగెల మర్మమెంటో!'శీర్షికన ప్రచురితమైన కథనానికి అప్పటి మున్సిపల్ కమిషనర్ స్పందించి వేలం ప్రక్రియ నిర్వహించారు.



- **బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాల్టీ అంబేడ్కర్ రడగంబాల బస్తీలో భూ ఆక్రమణపై మార్చి 2న 'ఆగని భూ కబ్జాలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ స్పందించి జేసీబీ, ట్రాక్టర్లతో ఇళ్ల పునాదులు, ఆక్రమణలు తొలగించారు.
- **ఆదిలాబాద్‌టౌన్:** డీఎస్సీ అభ్యర్థుల నియామకాల్లో విద్యాశాఖ తప్పిదాలతో పలువురికి పోస్టింగ్ ఇవ్వకపోడంతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'ఫలించిన నిరీక్షణ'కథనం ఇవ్వడంతో 11 మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారు.
- రిమ్స్ ఆడిటోరియంలో మందులు విచ్చలవిడిగా పారేడయంపై 'ఏమాత్రం శ్రద్ధలేదు'శీర్షికన కథనం 'సాక్షి'మెయిన్ పేజీలో ప్రచురితమైంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లా డ్రగ్‌స్టోర్ ఇన్‌చార్జిని సరెండర్‌తోపాటు చర్యలు తీసుకున్నారు.
- ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో అక్రమ డిప్యూటేషన్లపై 'స్పోర్ట్స్‌కు పైరవీలు'శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. డిప్యూటేషన్లను రద్దు చేసి, అర్హులైన ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై నియమించారు.
- బడిబాటలో భాగంగా 'బడిబాట అంతంతే'శీర్షికన కథనం ప్రచురితమైంది. విద్యాశాఖ అధికారులు నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు.
- 'ప్రైవేట్ బస్సు డేంజర్'శీర్షికన ప్రచురితమైన కథనానికి రవాణాశాఖ అధికారులు స్పందించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. రెండు ప్రైవేట్ బస్సులను సీజ్ చేశారు.
- 'మాతృవేదన'శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రి బిల్లుల కోసం బాధితులను వేధించడంపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు.



- **వాంకిడి:** సోయంగూడ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా మూతపడి ఉండగా ఫిబ్రవరి 4న 'అక్షరం దిద్దని ఆదివాసీ బిడ్డలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.
- రిమ్స్‌లో 'స్ట్రెచర్‌పైనే ఐదున్నర గంటలు'శీర్షికన ప్రచురితైన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ సీరియస్ అయ్యారు. ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేశారు.
- 'వచ్చిరాని వైద్యం.. శంకర్ దాదా ఎంబీబీఎస్'లు అనే వరుస కథనాలు 'సాక్షి'లో ప్రచురితం కావడంతో డీఎంహెచ్‌వో స్పందించారు. పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై కొరడా ఝులిపించారు.
- తలమడుగు మండలంలోని ఓ పాఠశాల టీచర్ అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారు. 'లీడర్ సారు.. ఇదేమి తీరు'కథనం ప్రచురితమైంది. డీఈవో స్పందించి.. సదరు టీచర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.
- తలమడుగు మండలం సాయిలింగి ప్రాథమిక పాఠశాలలో 'పంతుళ్ల కోసం విద్యార్థుల పడిగాపులు'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి టీచర్లకు మెమోలు జారీ చేశారు.
- ఉట్నూర్ ఉర్దూ మీడియం పాఠశాల టీచర్‌పై పోక్సో కేసుపై జైలుకెళ్లాడు. అయినా సస్పెండ్ చేయకపోవడంతో 'ఆ సారుపై ఎందుకంత ప్రేమ'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సదరు టీచర్‌పై డీఈవో సస్పెన్షన్ వేటు వేశారు.
- జిల్లాలో'గుట్టుగా మొరం అక్రమతవ్వకాలు' శీర్షికనకథనం ప్రచురితమైంది. మైనింగ్ అధికారులు టిప్పర్లు, పొక్లెయినర్లను సీజ్ చేశారు.
- నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసే ఓ అధికారికి పేషెంట్ కేర్ సిబ్బంది పీఏగా వ్యవహరించాడు. పలువురు స్టాఫ్‌నర్సులను వేధింపులకు గురిచేయడంతో 'రిమ్స్ పీఏ దాదాగిరి'అనే కథనం ప్రచురితమైంది. రిమ్స్ డైరెక్టర్ ఆయన్ను విధుల నుంచి తొలగించారు.
- టీచర్ల బదిలీల్లో కొందరు నిబంధనలను తుంగలో తొక్కారు. 'స్పౌజ్..అవకతవకలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఈవో స్పందించి ముగ్గురు టీచర్లకు షోకాజు నోటీసులు జారీ చేసి ఇంక్రిమెంట్‌లో కోత విధించారు.
- **తాంసి:** భీంపూర్ మండలం గోవింద్‌పూర్‌లో కిడ్నీ వ్యాధితో 12 మృతిచెందారు. గిరిజనులు గ్రామాన్ని ఖాళీ చేయడంపై సాక్షి మెయిన్‌లో ఏప్రిల్ 3న 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు.
- భీంపూర్ మండలం గుబిడిపల్లిని కిడ్నీ సంబంధిత వ్యాధి వేధిస్తోంది. జనవరి 10న 'ఆ ఊళ్లో కిడ్నీలు ఫెయిల్'శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.
- **కైలాస్‌నగర్:** జిల్లాలో అక్రమ లేఅవుట్లపై 'అక్రమాలపై పట్టింపేది'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి మున్సిపల్ అధికారులపై సీరియస్ అయ్యారు.
- శివాజీచౌక్, ఓల్డ్‌బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ షాపులకు ఏళ్లు అద్దెలు చెల్లించడం లేదు. ఈ తీరుపై 'అద్దెకు ఎగనామం'శీర్షికన కథనం ప్రచురితంకావడంతో కమిషనర్ స్పందించి బకాయి వసూళ్లు చేయించారు.
- పట్టణంలోని ఆసరా పెన్షన్ నిలిచిపోవడంపై 'ఆసరా అందలే!'శీర్షికన కథనాన్ని ప్రచురితమైంది. అధికారులు స్పందించి చెల్లించారు.
- జిల్లాలో గడిచిన వేసవిలో 'దాహం కేకలు' శీర్షికన కథనం ఇచ్చాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.
- **వాంకిడి:** గిరిజన పాఠశాలల్లో టీచర్లు రాకపోవడంపై 'గిరిబడులకు సార్లు డుమ్మా'ఫిబ్రవరి 7న శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పటి కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకున్నారు.
- అవినీతికి పాల్పడుతున్న కానిస్టేబుల్ వ్యవహారంపై సెప్టెంబర్ 24న 'వాంకిడి పీఎస్‌లో వసూల్ రాజా'శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా పోలీస్ అధికారులుచర్యలు తీసుకున్నారు.
- ఎనోలి కోలంగూడలో నీటి సమస్యలపై మార్చి 17న 'తాగునీటి కష్టాలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్..సమస్య పరిష్కరించారు.
- **మంచిర్యాలఅర్బన్:** దూరంగా ఉన్నా సర్కారు బడి విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో 'సారు బడి తరలించరూ శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించారు. స్టేషన్‌రోడ్ పాఠశాల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి తరలించారు.
- రెండు జిల్లాలకు సేవలందించే మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలలో వైద్యుడు లేరు. ఫిబ్రవరి 27న 'సాక్షి'లో వైద్యుడు రాడు.. మందులు లేవు శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి వైద్యుడిని నియమించారు.
- స్థానిక బస్టాండ్‌కు దగ్గర ఉన్నా బాలుర ఉన్నత పాఠశాలలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారందరూ బైక్‌లు సైకిల్ షెడ్డులో నిలిపివెళ్లేవారు. రోజుల తరబడి ఉంచటంతో విద్యార్థులు సైకిళ్లు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియకుండా పోయింది. మార్చి 6న షెడ్డులో బైక్‌లు..చెట్ల కింద సైకిళ్లు శీర్షికన కథనం ప్రచురించటంతో హెచ్‌ఎం స్పందించి పాఠశాల గేట్‌కు తాళం వేశారు. అప్పటి నుంచి ఇతర వాహనాలు పాఠశాల ఆవరణలోకి రాకుండా పోయాయి.
- సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన రెండో విడత నిధులు విడుదల కాకపోవడంతో మార్చి 22న 'సాక్షి'బడి నిర్వహణ నిధులేవి కథనానికి అధికారులు స్పందించారు. 720 స్కూళ్లకు 50 శాతం నిధులు రూ.75.85 లక్షలు మంజూరు చేశారు.
- **మంచిర్యాలక్రైం:** జనవరి 8న గోదావరిలో ఇసుక దొంగలు శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకున్నారు.
- **పాతమంచిర్యాల:** జిల్లాకేంద్రంలో తపాలాశాఖకు చెందిన రైల్వేమెయిల్ సర్వీస్ సార్టింగ్ కార్యాలయం తరలింపుపై 'డిస్ట్రిబ్యూషన్ తరలింపు'పై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించారు.
- **దహెగాం:** ఏప్రిల్ 11న మొట్లగూడలో నీటి గోస శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చర్యలు తీసుకున్నారు.
- మే 5న దహెగాం సహకార సంఘంలో జరిగిన అవినీతిపై 'సహకారంలో అవినీతి'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించి సీఈవో బక్కయ్యను సస్పెన్షన్ చేశారు.
- జూలైలో పీకలగుండంలో నీటి సమస్యపై 'తాగునీటికి ప్రాణాలు పలం'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఎల్‌పీవో సురేష్ స్పందించి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

- **కౌటాల:** మండలంలోని గుడ్లబోరి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చహారే కరిష్మా హైదరాబాద్‌లోని అపోల్‌లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి రీత్యా అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'వెలుగులోకి తెచ్చింది. దాతల సాయంతో కళాశాలలో చేరింది. రెండో ఏడాదిలో ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో జనవరి 3న 'ఫీజు కట్టలేక.. చదువు ప్రశ్నార్థకం'శీర్షికన కథనం ప్రచురితమైంది. హైదరాబాద్‌కు చెందిన ఓ ఎన్‌జీఓతోపాటు దాతలు రూ.1.75 లక్షల సాయం అందించారు.
- ఆగస్టు 11న గుండాయిపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని జాడె పూజ(16) జ్వరంతో బాధపడుతుండగా.. ఆర్‌ఎంపీ వైద్యం అందించడంతో వైద్యం వికటించి మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన బోయర్ కాళిదాస్ (32) ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందాడు. ఈక్రమంలో గత ఆగస్టు 12న 'కిల్లింగ్ జ్వరాలు..!'శీర్షికన కథనం ప్రచురితమైంది. డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో, అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఆర్‌ఎంపీలు వైద్యం చేయవద్దని హెచ్చరించారు.



తప్పిన ప్రమాదం

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వెళ్లే మట్టిరోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. గురువారం మల్లాపూర్ నుంచి టాటాఏస్ వాహనం పార్‌పెల్లి వెళ్తుండగా అదుపుతప్పి గుంతలో దిగబడింది. డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇప్పటికైన అధికారులు గుంత పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దారి దోపిడీకి యత్నం

- ప్రతిఘటించిన బాధితుడు.. దొంగలు పరార్
- బాధితుడికి కత్తి గాయాలు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


గాయపడ్డ సురేశ్

గుడిహత్నూర్: దారిలో దోపిడీకి ప్రయత్నించిన దొంగలు బాధితుడు ధైర్యంగా ప్రతిఘటించడంతో పరార్ అయ్యారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఈఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన బండి సురేశ్ స్థానిక వైన్స్‌షాపులో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగా బుధవారం రాత్రి 9 గంటల అనంతరం వైన్స్ షాపు మూవేసి సహచర ఉద్యోగి రాజుతో వేర్వేరు బైక్‌లపై ఇంటికి బయల్దేరారు. అప్పటికే సురేశ్‌ను నలుగురు దొంగలు రెండు స్కూటీలపై అనుసరించారు. శివాలయం వెనుక చీకటిగా ఉన్న జాతీయ రహదారి వద్ద ఒక్కసారిగా సురేశ్ బైక్‌ను ఢీకొట్టారు. కంట్లో కారం చల్లి మెడకు కత్తి పెట్టి నగదు బ్యాగు లాక్కునే ప్రయత్నం చేశారు. తీవ్రంగా ప్రతిఘటిస్తూ గట్టిగా అరవడంతో ముందు వెళ్తున్న రాజు బైక్‌ను వెనుకకు రావడంతో దొంగలు కత్తితో సురేశ్‌ను గాయపర్చి పరారయ్యారు. తీవ్రగాయాలైన అతడు ఎస్సై మహేందర్‌కు జరిగిన విషయాన్ని వివరించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా, సురేశ్ బ్యాగులో రూ.3 లక్షల నగదు ఉంది. దోపిడీకి యత్నించిన వారంతా యువకులేనని బాధితుడు తెలిపాడు. రాజు వెనకకు రావడంతో సురేశ్‌కు ప్రాణప్రాయం తప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


స్వాతి (ఫైల్)

కౌటాల: మండల కేంద్రానికి చెందిన యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పిట్టల సత్యనారాయణ–పార్వతి దంపతులకు కుమారుడు, కుమార్తె స్వాతి ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన స్వాతి (23) ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు గమనించి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి..


సిద్దార్థ (ఫైల్)

బెల్లంపల్లి: రైలు కిందపడి యువకుడు బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. రైల్వే రడగంబాల బస్తీలో నివాసం ఉంటున్న కదాసీ సిద్దార్థ (17) పట్టణంలోని బట్టల షాపులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. తన ప్రేమకు గుర్తుగా సదరు చేతిపై టాటు వేయించుకున్నాడు. ఇటీవల సదరు అమ్మాయి మరో యువకుడిని ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న సిద్దార్థ భరించలేకపోయాడు. తీవ్ర మనస్తాపం చెంది ఎడమ చేతిపై కత్తితో గాట్లు వేసుకుని కాల్‌టెక్స్ రైల్వే ఫ్లెట్ఓవర్ బ్రిడ్జి కింద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అన్నపై దాడి చేసిన తమ్ముడికి ఆరునెలల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అన్నపై దాడి చేసిన తమ్ముడికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం జడ్జి దుర్గరాణి గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రాంపూర్ (రామాయి)కి చెందిన అన్న దుర్వెట్టి నారాయణపై తమ్ముడు సకారాం 2018 అక్టోబర్ 21న కర్రతో తలపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన నారాయణ భార్య పంచపూలపై చెయ్యి చేసుకున్నాడు. ఆమె ఫిర్యాదుతో అప్పటి ఎస్సై హరిబాబు కేసు నమోదు చేశారు. పీపీ నవీన్ కుమార్ 8మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

భైంసారూరల్: ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కుంటాల మండలం విట్టాపూర్‌కు చెందిన ఏలేటి ఇంద్రారెడ్డి (35) గురువారం రాత్రి బైక్‌పై భైంసాకు వస్తున్నాడు. వానల్‌పాడ్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో భక్తుల రద్దీ


చిన్నారితో అక్షర శ్రీకారం చేయిస్తున్న అర్చకుడు


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

బాసర: వరుసగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు రావడంతో బాసరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గురువారం శుభ ముహూర్తం కావడంతో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. శివాలయంలో పూజలు చేశారు. భక్తులు కుంకుమార్చన, అక్షరాభ్యాస పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి నవీన్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువజామున శ్రీజ్ఞాన సరస్వతీ, మహాలక్ష్మీ, మహాకాళీ అమ్మవార్లకు ఆలయ అర్చక వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, అర్చన, గణపతి, సరస్వతీమాతా పారాయణం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టినట్లు అధికారులు వెల్లడించారు.

ముగిసిన జాతీయస్థాయి పోటీలు

- సాఫ్ట్‌బేస్‌బాల్ విజేత కేరళ జట్టు
- అన్ని విభాగాల్లోనూ సత్తాచాటిన క్రీడాకారులు
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు
- మూడో స్థానంలో మధ్యప్రదేశ్ జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం


కేరళ రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రవీణ్


ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన కేరళ రాష్ట్ర క్రీడాకారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా నిర్వహించిన జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. ఈ నెల 24న సింగరేణి తిలక్ స్టేడియంలో ప్రారంభమైన జాతీయ స్థాయి 9వ సబ్ జూనియర్ బాలబాలికలు, మెన్(యూత్), ఉమెన్ విభాగాల్లో పోటీలు మూడు రోజులపాటు హోరాహోరీగా సాగాయి. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. గురువారం ఉదయం సెమీఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆది నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. పోటీల్లో కేరళ రాష్ట్ర క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరై సాఫ్ట్‌బేస్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవికుమార్‌తో కలిసి బహుమతి ప్రధానం చేశారు.

సబ్ జూనియర్ బాలుర విభాగంలో..

సబ్‌జూనియర్ బాలుర విభాగంలో కేరళ రాష్ట్ర జట్టు ప్రథమ, మహారాష్ట్ర జట్టు ద్వితీయ, తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

బాలికల విభాగంలో ..

సబ్ జూనియర్ బాలికల విభాగంలోనూ కేరళ రాష్ట్ర జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ, మధ్యప్రదేశ్ రాష్ట్ర జట్టు తృతీయ బహుమతి దక్కించుకున్నారు.

యూత్ మెన్ విభాగంలో ..

యూత్ మెన్ విభాగంలో కేరళ రాష్ట్ర జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుని అబ్బుర పరిచింది. తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ, మధ్యప్రదేశ్ జట్టు తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

యూత్ మహిళల విభాగంలో..

యూత్ మహిళల విభాగంలోనూ కేరళ రాష్ట్ర జట్టు తిరుగులేని ఆటతీరును ప్రదర్శించింది. కేరళ ప్రథమ, తెలంగాణ ద్వితీయ, మధ్యప్రదేశ్ తృతీయ బహుమతి గెలుచుకున్నాయి.

తిరుగులేని ఆధిక్యత కనబర్చిన కేరళ

పోటీల్లో కేరళ రాష్ట్ర క్రీడాకారులు తిరుగులేని ఆధికత్యను కనబర్చారు. సబ్ జూనియర్ బాలబాలికల, యూత్ విభాగంలో జరిగిన మెన్, ఉమెన్ పోటీల్లో పట్టుదలతో ఆడారు. క్రీడాపోటీలకు ఆతిథ్యం ఇచ్చిన తెలంగాణ జట్లు ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోగా, మధ్యప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.గురువేందర్, జాయింట్ సెక్రెటరీ యు.వెంకటేష్, కోశాధికారి ఇమ్మానియెల్ దినకర్, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, నాతరి స్వామి, త్రోబాల్ జిల్లా సెక్రెటరీ బలరాం, తైక్వాండో ఉమ్మడి జిల్లా ఇంచార్జి జిల్లపల్లి వెంకటస్వామి, అండర్–19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.